# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- భారత సైనిక దళాలు పెహల్గామ్ ఉగ్రదాడులకు వ్యతిరేకంగా నిన్న అర్ధరాత్రి ఆపరేషన్ సిందూర్ ని ప్రారంభించాయి.
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గడిచిన 10 నెలల్లో కేంద్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- విశాఖపట్నంలోని పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ లో సైరన్ శబ్దాలతో కొద్దిసేపటి క్రితం మాక్ డ్రిల్ ప్రారంభమయ్యింది.
- దేశ సమగ్రతకు విఘాతం కలిగేలా సామాజిక మాద్యమాలలో పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

===================

భారత సాయుధ దళాలు నిన్న అర్ధరాత్రి తర్వాత 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించాయి. ఈ ఆపరేషన్ లో భాగంగా పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ తో పాటు, పాకిస్తాన్ లో ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయి. ఈ ఉగ్రవాద స్థావరాల నుండే ఇటీవల పెహల్గామ్ లో జరిపిన ఉగ్రదాడికి కుట్ర పన్నారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇక పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతి చర్యగా భారత సాయుధ దళాలు 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా చేపట్టడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. మన దేశం ఉక్కు సంకల్పంతో తనను తాను రక్షించుకుంటుందని భారత సైన్యం మళ్ళీ నిరూపించిందని పేర్కొన్నారు.

===================

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గడిచిన 10 నెలల్లో కేంద్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, ఎలమంచిలి మండలాల్లో ఈరోజు ఆయన రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. సుమారు ఐదు పనులను 4కోట్ల 16లక్షల 23వేల రూపాయలతో చేపడుతున్నామన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, రాష్ట్రంలో రైల్వే లైన్ల అభివృద్ధికి మొత్తం మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి వివరిస్తూ...

(భూపతిరాజు శ్రీనివాస వర్మ వాయిస్ బైట్... 37 సెకన్లు)- ప.గో. జిల్లా

ఆదే విధంగా.. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పాలకొల్లులో 220కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు కొరత లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు అవసరమైన సబ్ స్టేషన్ నిర్మాణాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(గొట్టిపాటి రవికుమార్...వాయిస్ బైట్...27 సెకన్లు)- ప.గో. జిల్లా

===================

దేశ పౌరులు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈరోజు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ ను నిర్వహిస్తోంది. అందులో భాగంగా కొద్ది సేపటి క్రితం విశాఖపట్నంలోని పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ లో సైరన్ శబ్దాలతో మాక్ డ్రిల్ ప్రారంభమయ్యింది. యుద్ధ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను ఈ సందర్భంగా వివరించారు. భవనాల నుంచి ప్రజలను బయటకు తీసుకొచ్చే ప్రక్రియపై అవగాహన కల్పించారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స, ఆసుపత్రులకు తరలించడంపై వివరించారు. ఈ మాక్ డ్రిల్ లో ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, విపత్తు నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

===================

ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేంత వరకు 'ఆపరేషన్ సిందూర్'ని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారత్ ధీటైన జవాబు చెప్పిందన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి పౌరుడూ బాధ్యతగా వ్యవహరించాలని, సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారం పోస్టులు పెట్టవద్దన్నారు. ఈరోజు ఆయన హైదరాబాద్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ భారత సైన్యాన్ని కించపరచినా... దేశ సమగ్రతకు విఘాతం కలిగేలా పోస్టులుపెడితే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

(వాయిస్ బైట్... 38సెకన్లు)

===================

విరామం

===================

భారత రక్షక దళాలు ఈరోజు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై ఆకాశవాణి వార్తా సేవల విభాగం ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేయనుంది. రాత్రి 7 గంటల 10 నిమిషాలకు "సుర్ఖియోన్ మే'' అనే కార్యక్రమం హిందీలో ప్రసారం కానుంది. అలాగే 9 గంటల 15 నిమిషాలకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై మరొక ప్రత్యేక కార్యక్రమం ఇంగ్లీష్ లో ప్రసారమవుతుంది. ఈ ప్రసారాలను అన్ని ఆకాశవాణి కేంద్రాలు, ఎఫ్ఎం గోల్డ్ చానల్ ద్వారానూ వినవచ్చు. అలాగే ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్ "ఆకాశవాణి ఎయిర్" లో కూడా ఈ ప్రసారాలు అందుబాటులో ఉండనున్నాయి.

===================

గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ పైవంతెన పునర్నిర్మాణానికి ఈరోజు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా ఇన్చార్జి మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 90 కోట్ల రూపాయల నిధులను అందచేయగా, మిగిలిన 20 కోట్ల రూపాయలను గుంటూరు నగరపాలక సంస్థ తరఫున రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. నగరంలోని నందివెలుగు, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫ్లైఓవర్లను కూడా రానున్న రెండేళ్లలో పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

===================

విశాఖ జిల్లాలో ఈ నెల 12 నుండి జరగబోవు ఇంటర్మీడియట్, పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈరోజు ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 19వ తేది నుండి 28వ తేదీ వరకు పదవ తరగతి, 12వ తేది నుండి 17వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

===================

అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ.. "భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు కేవలం సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన అల్లూరి, బ్రిటిష్ వారి అణచివేతను ధీటుగా ఎదిరించారని పేర్కొన్నారు.

గిరిజనుల హక్కుల కోసం పోరాడి, వారికి చైతన్యం కలిగించిన ఆ మహనీయుడు స్వాతంత్ర్య ఉద్యమానికి దిక్సూచి అని, ఆయన ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు భారత ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు.
మరోవైపు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గిరిజన హక్కుల పరిరక్షణ కోసం మన్యం ప్రజల గుండెల్లో పౌరుషాగ్ని రగిలించడంతో పాటు 'అందరికీ విద్య' వంటి మహోన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేసిన అభ్యుదయవాది అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సామాజిక మాద్యమం ఎక్స్ వేదికగా పేర్కొంటూ.. ఆయనకు నివాళి అర్పించారు.

===================

పార్వతీపురంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 9వ తేదీన ఉద్యోగ మేళాను నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుండి 28సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో నియామకాలు చేపడతాయని వివరించారు. ఇక మరోవైపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాల నందు మూడు నెలలు వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని కె. సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

===================
===================